క్లుప్తంగా

రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

భానుపురి : సూర్యాపేట రెవెన్యూ ఉద్యోగులు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంగా రెవెన్యూ ఉద్యోగులు సాధించుకున్న విజయాలను గుర్తు చేసుకున్నారు. భూభారతి – 2024 చట్టం, గ్రామానికో రెవెన్యూ ఉద్యోగిని తీసుకొచ్చిన తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ సెక్రటరీ రామకృష్ణ, ఇతర నాయకులు రాములు, రమేష్, పూల్‌సింగ్, బి.రాంరెడ్డి, వి.భిక్షం, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, వివిధ మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎఫ్ ప్రధాన కార్యదర్శిగా దైద సాగర్



నియామకపత్రం అందిస్తున్న పరశురాం

సూర్యాపేట : తెలంగాణ మాదిగ ఫెడరేషన్ బలోపేతానికి ప్రతి మాదిగ పాటుపడాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పొలదుగు పరశురామ్ మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎంఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన దైద సాగర్ మాదిగను నియమించి నియామక పత్రం అందించారు. అలాగే టీఎంఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా పిడమర్తి ఉపేందర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధిగా పోలెపాక నవీన్‌కుమార్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ ఫెడరేషన్ పట్టణ ప్రధాన కార్యదర్శి బొడ్డు దుర్గయ్య, ప్రవీణ్, నాగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రచయితకు అభినందనలు

అర్వపల్లి : కాసర్లపహాడ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దబ్బేటి యాదగిరి కూతురు దబ్బేటి నవ్య 'ప్లవ బండి' అనే కథను రాశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె రాసిన కథ కథావేదిక 2024లో ప్రచురితం కావడంతో పలువురు కవులు, కళాకారులు, సాహితీప్రియులు అభినందించారు. నవ్య ఇప్పటికే పలు పుస్తకాలలో కథలు రాశారు.

ప్రతిపక్షాలపై అక్రమ కేసులు

తుంగతుర్తి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన మీద పట్టు లేక ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి పబ్బం గడుపుతోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రజలకు సరైన పద్ధతిలో అందించలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీను, గోపగాని వెంకన్న, వెంకటేష్, అఖిల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

తిరుమలగిరి : మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం మండల స్థాయి ప్రతిభా పోటీల్లో తిరుమలగిరి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జి.సాయిచరణ్, ఎ.వైష్ణవి, పి.సోమేష్‌కుమార్, జలాల్‌పురం ఉన్నత పాఠశాల విద్యార్థిని స్పందన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు జనవరి 4న సూర్యాపేటలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం దామెర శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో బోసు బాబు, కంట్లం గౌడ్, వెంకన్న, రఘుపతి పాల్గొన్నారు.

కనీస వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి తెలిపారు. సోమవారం మాచారం గ్రామంలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. గతంలో సమ్మెలో పాల్గొన్న వారికి ఆపిన వేతనాలు వెంటనే అందజేయాలన్నారు. వేసవిలో ప్రభుత్వ పాఠశాలలతోపాటు సెలవులు ప్రకటించాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ దుర్గాదేవి, జయమ్మ, సరిత, ప్రమీల, జ్యోతిలక్ష్మి, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకు ఏకలక్ష్మి

ప్రమాదకరంగా ప్రధాన రహదారి



గుంతలమయంగా మారిన మద్దిరాల-ముకుందాపురం ప్రధాన రహదారి



ముకుందాపురం గ్రామ బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- మద్దిరాల – ముకుందాపురం రోడ్డుపై పెరుగుతున్న రద్దీ
- గుంతలు, మూల మలుపులతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- రోడ్డు నిర్మించాలని వేడుకోలు

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రం నుంచి ముకుదాపురం వెళ్లే ప్రధాన రహదారి (బీటీరోడ్డు) గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఆటోలతోపాటు భారీ వాహనాలు తరచుగా వెళ్తుండడం వల్ల రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల వల్ల చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

గుంతలు.. మూల మలుపులు

ముకుందాపురం, జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, తూర్పుతండా, చిన్ననెమిల, చందుపట్ల గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి తరుచుగా వస్తుంటారు. కానీ గుంతలమయంగా మారిన రోడ్డుపై వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మరిపెడ బంగ్లా, ఖమ్మం వెళ్లడానికి షార్ట్‌కట్ కావడంతో ఈ రూట్‌లోనే ఎక్కువ మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ రోడ్డుపై గుంతలతోపాటు మూల మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

గతంలో నిధులు మంజూరు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2.55కోట్ల ఎంఎంఆర్ గ్రాంట్‌తో నూతన రోడ్డు మంజూరైంది. అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నూతన రోడ్డు నిర్మాణం కోసం శిలఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. కానీ ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డును మంజూరు చేసి, వెంటనే పనులను ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలు



మద్దిరాల–ముకుందాపురం ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా ఇప్పటికే చాలా ప్రమాదాలు చోటుకున్నాయి. అధికారులు వెంటనే స్పందించి నూతనరోడ్డును మంజూరు చేసి ప్రమాదాలను నివారించాలి.

– సాహెభూషణ్, మాజీ కోఆప్షన్ మెంబర్, చిన్ననెమిల

డబుల్ రోడ్డు నిర్మించాలి



మద్దిరాల మండలం కాకముందే ఈరోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు మండలం కావడంతో ఇంకా వాహనాల రద్దీ పెరిగింది. కానీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్‌రోడ్డును మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలి.

– కల్లెపల్లి భాస్కర్, సీపీఎం నాయకుడు, జి.కొత్తపల్లి

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్ : కేసులు పెండింగ్ లేకుండా పనిచేయాలని, బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం అందరూ బాగా పని చేశారని, రాబోవు రోజుల్లో కూడా ఇలాగే ప్రజల మద్దతు పొందేలా పని చేయాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. నూతన సంవత్సర వేడుకలకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా గొడవలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. బహిరంగంగా మద్యం తాగితే కేసులు నమోదు చేయాలని అన్నారు. బాణసంచా, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. కార్యక్రమం అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస రావు, ఏఆర్డీ ఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇప్పించాలని వినతి

భానుపురి : పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించాలని బాధితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ డేలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అయిదున్నర ఏళ్ల క్రితం రాత్రికి రాత్రే వచ్చి 385 దుకాణాలను కూల్చివేశారని, కనీసం పరిహారం కూడా చెల్లించలేదని అన్నారు. దుకాణాలు, ఇళ్లు కోల్పోయిన వారిని రోడ్డున పడేశారని తెలిపారు. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారంతా కలెక్టర్ వద్ద వాపోయారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి.. అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారి విస్తరణ బాధితుల సంఘం అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, రాఘవేంద్రప్రసాద్, ఇల్లందుల నవీన్, నల్లపాటి ప్రశాంత్, వీరబాబు, గుంటి కల్యాణి, ఎండీ.అజీజ్, పాలవరపు సతీష్, కటకం అనుమయ్య, సుధాకర్, సర్వదేవభట్ల హరినాథ్, కందగట్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 5వ తేదీలోపు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ జహీర్‌బాబా

సూర్యాపేట : వికలాంగులకు, అన్ని రకాల ఆసరా పెన్షన్‌దారులకు ప్రతి నెలా 5వ తేదీలోపు పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్ బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పింఛన్లు సకాలంలో రాకపోవడంతో నెలకు కావాల్సిన నిత్యావసరాలు కొనుక్కోవడానికి పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి నెలా 5వ తేదీలోపు అన్ని ఆసరా పెన్షన్లు ఇవ్వాలని గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్లు పొందిన వారికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సాంబయ్య, కార్యదర్శి మిద్దె సైదులు, పాండవుల లింగయ్య, తరుణ్, రామారావు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు



భానుపురి : కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



ప్రచారం చేస్తున్న నాయకులు

భానుపురి : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, తక్షణమే ఆయనను మంత్రివర్గంలో నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, సీపీఐ జిల్లా నాయకులు దంతాల రాంబాబు, ఎం సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. అంబేద్కర్ పై అమిత్ షా తిరస్కార స్వరంతో మాట్లాడడం తన అహంకారాన్ని రుజువు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, పోరండ్ల దశరథ, దండి ప్రవీణ్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రచారం..

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలపై సోమవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సూర్యాపేట పట్టణంలో ప్రచారం చేశారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, శ్రామిక కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, వీరబోయిన రవి, లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

1న సామూహిక ధ్యానం

సూర్యాపేట : నూతన సంవత్సరం సందర్భంగా సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డలోని శ్రీ అరవింద కేంద్రంలో జనవరి 1న ఉదయం 10:17 నిమిషాలకు సామూహిక ధ్యానం నిర్వహిస్తున్నట్లు శ్రీ అరవింద సొసైటీ కార్యదర్శి కొల్లు మధుసూదన రావు, సంయుక్త కార్యదర్శి పర్వతం శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనుల నిర్వహణ, కొత్త లైన్ల నిర్మాణంలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దాత భాగ్యరాజ్

చివ్వెంల: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలని జిల్లా కాంగ్రెస్ యువజన నాయకుడు ధారోజు భాగ్యరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో తన తండ్రి ధారోజు జానకి రాములు జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మొలుగూరి సునీత, దొనకొండ శ్రీనివాస్, కౌన్సిలర్ షఫీఉల్లా, నిమ్మల వెంకన్న, దొనకొండ వీరయ్య, సాగర్, రాంమల్లు, శ్యామ్ సుందర్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

చివ్వెంల : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ మహేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడుపవద్దని అన్నారు. టపాసులు, డీజేలపై నిషేధం ఉన్నట్లు పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నాగారం : న్యూఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్ఐ ఐలయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు తమ ఇళ్లలోనే వేడుకలు జరుపుకోవాలని అన్నారు. వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 31న స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, పట్టుబడితే వాహనాలు సీజ్‌చేసి, లైసెన్స్‌లను రద్దు చేస్తామని అన్నారు. డీజేలు, బాణసంచాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీరన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా వేడుకలు జరుపుకోవాలని అన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

పెన్‌పహాడ్ : మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏఎస్ఐ రాములు అన్నారు. సోమవారం దోసపహాడ్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పోలీసు కళాజాతా నిర్వహించారు. సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై 1930టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధింపులపై 100కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమావత్ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ మచ్చ ప్రవీణ్, కళాబృందం సభ్యులు గోపయ్య, గురులింగం, క్రిష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఇరుగు మధుకర్

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామ ప్రగతి యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇరుగు మధుకర్, ఉపాధ్యక్షుడిగా ఇరుగు నవీన్, ప్రధాన కార్యదర్శిగా కోడి ఉపేందర్, కోశాధికారిగా బొల్లికొండ సతీష్, సహాయ కార్యదర్శులుగా ఇరుగు రాంబాబు, కోడి పవన్ కుమార్, ఇరుగు అఖిల్ కుమార్ ఎన్నికయ్యారు.

గుమ్మడి వెన్నెలకు సన్మానం

తిరుమలగిరి : తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ గుమ్మడి వెన్నెలను సూర్యాపేట జిల్లా సాంస్కృతిక సారథి గాయకుడు పాలకుర్తి శ్రీకాంత్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వంతో చర్చించాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

తుంగతుర్తి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని 600 మోపుల గడ్డివాము దగ్ధమైన సంఘటన సోమవారం తుంగతుర్తిలో చోటు చేసుకుంది. తుంగతుర్తికి చెందిన రైతు కొండ వీరయ్య తన ఇంటి ఆవరణలో సుమారు 600మోపుల గడ్డి వాము ఉంచాడు. అయితే సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. రూ.60వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

'స్వామి నారాయణ్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు

చివ్వెంల : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఇట్సో) ఫలితాల్లో ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇట్సో లెవల్-1 ఫలితాల్లో 478 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్ హార్థిక్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడవ తరగతి విద్యార్థులు 50 మంది, నాలుగవ తరగతి విద్యార్థులు 92 మంది, ఐదవ తరగతి 91మంది, ఆరవ తరగతి విద్యార్థులు 72 మంది, ఏడవ తరగతి 53 మంది, ఎనిమిదవ తరగతి విద్యార్థులు 50 మంది, తొమ్మిదవ తరగతి విద్యార్థులు 70 మంది ప్రతిభ కనబరిచి ఇట్సోకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్ర స్వరూప్ దాస్ జీ స్వామీజీ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని దేవాలయంలో భక్తులకు ప్రసాదం పంచుతున్న అర్చకుడు పవన్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మంగళహారతులతో గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు పదిహేనవ పాశురం పఠించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : రామాలయంలో పూజలు..

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవికి మంగళహారతులతో పూజలు చేశారు. తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మామిడి రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. సోమవారం మృతురాలి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబీద్, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధు, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కేసరి శోభారెడ్డి, బూత్ అధ్యక్షుడు బొల్లం అరవింద్, మొండికత్తి శివాజీ, మామిడి వెంకన్న, సోమయ్య, ఆంజనేయులు, రామానుజం, నల్లపు సైదులు, మామిడి శ్రీను తదితరులు ఉన్నారు.

14వేల క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు

అర్వపల్లి : అర్వపల్లిలోని ఐకేపీ సన్నధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 14 వేల క్వింటాళ్ల సన్నధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఏపీఎం వలిశెట్టి మల్లేష్ తెలిపారు. అర్వపల్లిలోని సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. ప్రస్తుతం కేంద్రంలో ఇంకా 4వేల క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సీసీ నగేష్, కేంద్రం ఇన్‌చార్జ్ లింగంపల్లి ఈశ్వరి పాల్గొన్నారు.

వన నర్సరీ పనుల పరిశీలన

అర్వపల్లి : వనమహోత్సవంలో భాగంగా మండల వ్యాప్తంగా నర్సరీలలో విత్తనాలు నాటాలని మండల పంచాయతీ అధికారి టి. గోపి కోరారు. సోమవారం అర్వపల్లిలోని వననర్సరీని పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఈ విడతలో 1,79,850 మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. నవీన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ చండీహోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : మార్గశిర మాస అమావాస్య సందర్భంగా ఉండ్రుగొండ శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన పంచగుండాత్మక యాగశాలలో సోమవారం నవ చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంత్రమూర్తి మనోహర శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణ మోహన్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.